క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నగదును అందజేస్తున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: రెండు నెలల క్రితం మాధవరం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తుంగభద్ర గ్రామానికి చెందిన అర్విన్ గాయపడి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భీమా యూత్ కమిటీ సభ్యులు ఆదివారం మండలంలోని రాంపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా బాధితుడి భార్య మీనకు రూ.25వేల నగదు సాయంగా అందజేశారు. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామని వై.సీతారామిరెడ్డి హామీ ఇచ్చారు.

శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,పంచామృతాభిషేకాలు చేపట్టారు. బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో బృందావనాన్ని అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఆశీనులు గావించి శ్రీ మఠం మాఢ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

28న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

ఎమ్మిగనూరుటౌన్: కౌలు రైతుల రాష్ట్ర సదస్సు ఈ నెల 28న విజయవాడలో జరుగనుందని, ఈ సదస్సుకు స్థానిక కౌలు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పంపణ్ణగౌడ్, తిమ్మయ్యలు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌలు రైతుల సమావేశంలో వారు మాట్లాడారు. జీఓ నెంబర్ 96ను అనుసరించి కౌలు రైతులందరికి రైతు భరోసా కింద ఎకరాకు రూ.10వేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సత్యన్న, జబ్బార్, శాంతన్న, బాలరాజు, భాస్కర్‌యాదవ్, ఖాజలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మాణం చేయడం పట్ల వాల్మీకి నాయకులు, వైస్ ఎంపీపీ గుడికల్ పోలయ్య, నాగేష్‌నాయుడు, వీజీఆర్ కొండయ్య, కోటేకల్ గ్రామ సర్పంచ్ లక్ష్మన్న, యాపీలయ్య, మురళీ నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఈమేరకు వాల్మీకులు స్థానిక ఫంక్షన్ హాల్‌లో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మాణం చేసిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు పుండుకూర రంగన్న, బీటీ లక్ష్మన్న, ఎల్‌ఐసీ రంగస్వామి, యల్లంబీడు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని మార్చాలి

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని మార్చి విద్యార్థులకు దగ్గరల్లో ఉండే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం తాలుకా కార్యదర్శి వీరేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన పరీక్షకు ఓ విద్యార్థిని 4 నిముషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతి ఇవ్వకుండా ఇంటికి పంపించారని, గ్రామానికి దాదాపు 3 కి.మీ. దూరంలో ఉండటంతోనే ఆలస్యమైందని, దీంతో గ్రామంలో ఉండేలా కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కాలినడకన రావడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు హనుమంతు, మహేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

పరీక్షల కాలం.. సెల్‌కు బందీ కావొద్దు

- తల్లిదండ్రుల్లో మార్పు రావాలి
- పరీక్షల సమయం.. ఫోన్‌కు విరామం ఇచ్చేద్దాం
- సోషల్ మీడియాతో సమయం వృథా
- ఆన్‌లైన్ గేమ్స్‌తోనూ ఇబ్బందులే
- మితిమీరిన వినియోగంతో నిద్రలేమి, మానసిక రుగ్మతలు



ఆదోనిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

ఆదోని అర్బన్ : ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి.. ఏప్రిల్ 3నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో చదివిన అంశాలను పునశ్చరణ చేసుకోవడమే కాకుండా మెరుగైన మార్కులు సాధించేందుకు మానసికంగా బలంగా ఉండేలా ఉపాధ్యాయులు సూచించిన అంశాలను, సూచనలు పాటించాలి. అలా కాకుండా సెల్ వినియోగానికి అలవాటు పడిన వారు దానిపైనే ధ్యాస కేంద్రీకరిస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదముంది. నేటి తరం రోజులో అధిక భాగం సెల్ ఫోన్‌తోనే గడుపుతోంది. మిగిలిన లోకం ఏమైనా పట్టించుకోవడం లేదు. చివరకు కనీసం ఇంట్లో ఏమి జరుగుతుందో కూడా పట్టించేకోనంత పరిస్థితికి వచ్చేశారు. సెల్ ఫోన్‌ను కేవలం సమాచారం తెలుసుకోవడానికి మాత్రమే వినియోగించాలని, దానికి బంధీ అయితే జీవితం అంధకారమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే భవిష్యత్ పక్కదారి పట్టే ప్రమాదం ఉందని, ఏమాత్రం గురి తప్పినా జీవితం తారుమారు అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

చిన్న వయస్సు నుంచే అలవాటుగా మారుతోంది..

మారాం చేస్తున్నారనో.. సరదాకో.. కాసేపు తమ పనికి అడ్డంకులు కలిగించరాదనో.. తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే పిల్లలకు సెల్ ఫోన్ ఇచ్చేస్తున్నారు. ఇది అలవాటు మారి చివరికి సెల్ ఫోన్ లేకపోతే భోజనం కూడా చేయని పరిస్థితికి చేర్చారు. ఇక కొంత వయస్సున్న పిల్లలు వీడియో గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో గంటల తరబడి వాటిలోనే తలదూరుస్తున్నారు. దీంతో పరీక్షలకు సిద్ధమవడం మాని, వాటితోనే రోజును గడిపేస్తే పరీక్షల్లో ఫలితం అటకెక్కే ప్రమాదముంది. దీంతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. సెల్ ఫోన్ అధికంగా చూడటం వల్ల మానసిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదముందని, మెదడు, వెన్నుముక, మెడ, కండరాల సమస్యలతో పాటు నరాలు, కంటి సంబంధిత సమస్యలు పెరిగిపోతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యా వ్యవస్థలో మెట్టుగా భావించే పది పరీక్షలు, జీవితానికి తొలిమెట్టుగా చెబుతున్న ఇంటర్ పరీక్షల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్ నుంచి దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే వారి జీవితం అగమ్యగోచరంగా మారే ప్రమాదముందని, ఫలితం వచ్చిన తరువాత బాధపడేకన్నా, ముందస్తుగా జాగ్రత్త పడటం ఉత్తమని చెబుతున్నారు.

సోషల్ మీడియా ప్రభావం..

ఫేస్ బుక్, యూట్యూబ్, ఇన్‌స్టా తదితర వాటి గురించి నేటి తరంలో తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. చాలా మంది రోజుకు కనీసం నాలుగు నుంచి ఆరు గంటల పాటు అందులోనే గడుపుతున్నారని ఓ సర్వే వెల్లడించిందంటే.. అది కూడా 15 నుంచి 21 సంవత్సరాల యువతే అధికంగా ఉంటుందని పేర్కొందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరీక్షల సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టారీల్స్ ఎక్కువైతే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరు. ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. ఆదోని నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షల్లో 3,200 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అలాగే.. 75 పాఠశాలలు ఉన్నాయి. అందులో 46 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2,553 మంది, 29 ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 1,701 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మొత్తం 4,254 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

పరిమితి దాటితే ప్రమాదమే..

రోజుకు 20 నిమిషాలు సెల్ ఉపయోగిస్తే ఇబ్బంది లేదని వైద్యులు అంటున్నారు. కానీ చాలామంది గంటల తరబడి సెల్‌ఫోన్‌లు, వీడియోగేమ్స్, కంప్యూటర్‌ల ముందు గడుపుతున్నారు. ప్రస్తుతం పరీక్షలు దగ్గరపడుతున్నా.. కొందరు ఆ వ్యసనాన్ని వదులుకోలేక పోతున్నారు. అలాంటి వారు తమకు తామే ఓ పరీక్ష పెట్టుకోవాలని వైద్యులు, ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ప్రతి పది నిమిషాలకు ఒకసారి ఫోన్ వైపునకు చేయి వెళ్తుందా, ఫేస్‌బుక్, వాట్సాప్ చూడాలనిపిస్తోందా అనే విషయాలను తమనుతామే ప్రశ్నించుకోవాలి. పరిస్థితి చేయి దాటినట్లయితే వాటికి దూరంగా ఉండాలని తీర్మానించుకోవాలి. ఇలా ఉండినట్లయితే నియంత్రణలో ఉన్నట్లే లెక్క. లేనిపక్షంలో వాటికి బానిస అయినట్లే. దీంతో లక్ష్యాన్ని చేధించడం ప్రశ్నార్థకమేనని పేర్కొంటున్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చే అలవాటు మానుకోవాలి. ప్రభుత్వం క్యూఆర్ కోడ్ టెస్టు పుస్తకాల్లో ఇచ్చి ఉంటుంది. దాంట్లో సబ్జెక్ట్ డేటా పిల్లలకు చదువుకోవడానికి ఉపయోగ పడుతుంది. అంతేగానీ అనవసరంగా పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇచ్చి సమయాన్ని వృథా చేసుకోనివ్వరాదు.
– రాజశేఖర్, ఉపాధ్యాయుడు (స్కూల్ అసిస్టెంట్)

నీలి రంగుతో కంట్లో తడి ఆరిపోతుంది



ఒక నిమిషంలో 8 నుంచి 12 సార్లు కళ్లు మూసి తెరుస్తాం. సెల్‌ఫోన్ చూడడం వల్ల కళ్లు మూయడం, తెరవడం పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో నల్లగుడ్డు తడి ఆరిపోతుంది. పుస్తకం, దగ్గర పెట్టుకుని చదవడం, ఎక్కువసేపు చూడడం వంటివి చేయరాదు. కనీసం 20 సెం.మీ., 20 అంచుల దూరంలో వీక్షించాలి. 20 నిమిషాలకొకసారి తల తిప్పి దూరంగా చూస్తే కంటి సమస్యను అదుపు చేసుకోవచ్చు. లేకపోతే భవిష్యత్‌లో కష్టం. – డాక్టర్ కృష్ణమూర్తి, కంటి వైద్యుడు

వెన్నుముక, మెడ నొప్పి సమస్యలు వస్తాయి



సెల్‌ఫోన్ ఎక్కువగా చూడడం వల్ల కంటి జబ్బుతో పాటు వెన్నుముక, మెడ నొప్పి వస్తాయి. అలాగే నరాలు బలహీనపడి మానసికంగా కుంగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కువగా వాటినే చూడటం వల్ల కళ్లు ఎర్రగా కావడం, మంటగా ఉండటం వంటి సమస్యలు తలెత్తుతాయి.సెల్‌ఫోన్‌లు పరీక్షల సమయంలో దూరంగా ఉంచడమే మంచిది. లేకపోతే మానసిక, శారీరకంగా, భవిష్యత్‌ను నష్టపోయే అవకాశుముంది. – డాక్టర్ పద్మకుమార్, కంటి వైద్యులు, ఆదోని ఏరియా ఆస్పత్రి

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి: ఈ నెల 27వ తేదీ (సోమవారం) నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక కేజీబీవీ ఎస్‌ఓ షాకీరా బేగం తెలిపారు. స్థానిక కేజీబీవీలో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ (ఎంపీసీ మాత్రమే)లో 40సీట్లు ఉన్నాయన్నారు. అనాథ పిల్లలు, బడి బయట, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలలోని పేద బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. apkgbv. apcfss. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు రామళ్లకోట రోడ్డులోని తమ కేజీబీవీలో సంప్రదించవచ్చన్నారు.

31వరకు గడువు పెంపు :

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడగించినట్లు స్థానిక బాలికల ఎస్సీ గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన తెలిపారు. వివరాలకు తమ గురుకులంలో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా, కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లలిత ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆలూరు ప్రాజెక్టు పరిధిలోని ఆలూరు మండలం అరికెర అంగన్‌వాడీ సెంటర్–3లో 1 ఆయా పోస్టు (ఎస్టీ రిజర్వు), ఆస్పరి మండలం ముత్తుకూరు సెంటర్–2లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఒక ఆయా పోస్టు, చిప్పగిరి మండం గుమ్మనూరు అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్తగా పనిచేసేందుకు బీసీ–డి కేటగిరి కింద ఒక ఖాళీ, ఏరూరు గ్రామ సెంటర్–1 ఓసీ రిజర్వేషన్ కింద ఒక పోస్టు ఉందన్నారు. ఆయా పోస్టుకు 7వ తరగతి, కార్యకర్త పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 01.07.2022 నాటికి 21 సంవత్సరాలు పూర్తి చేసుకుని 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఈనెల 29 తేది సాయంత్రం 5 గంటల లోపు ఆలూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కౌతాళం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు రాజశేఖర్‌రెడ్డి, లింగన్న, ఖాదర్‌బాషా, బుడదొడ్డి, గౌస్‌మోదిన్, హుసేన్‌బాషా మాట్లాడుతూ పదో తరగతి పూర్తయి 25 సంవత్సరాలైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముందుగా సరస్వతి పూజ అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువ, పూలమాలతో సన్మానించారు. నాటి జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకుని సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులు నరసింహచారి, భీమయ్యశెట్టి, ఎల్లమ్మ, నాగరాజు, వేణుగోపాల్, ఆదాం మాట్లాడుతూ పాఠాలు బోధించిన తమను గుర్తుంచుకుని నేడు ఇక్కడికి ఆహ్వానించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కూడా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి అండగా నిలిచి విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హనుమంతప్ప, బీరప్ప, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కోసిగి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మార్కండేయ స్వామి ఆలయ కాలనీలో డ్రైనేజీ , సీసీ రోడ్డు నిర్మాణానికి పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధుల్లో కోసిగి –3వ సచివాలయ పరిధిలోని రూ.7.50 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత లోపించకుండా వేగవంతంగా రోడ్డు పనులు చేయించాలని కాంట్రాక్టర్ బసిరెడ్డిని ఆదేశించారు.



కోసిగిలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న వై.సీతారామిరెడ్డి

ఎంపీపీ ఈరన్న, వాణిజ్య విభాగం జిల్లా నాయకులు ఇల్లూరి ఆదినారాయణ, మహంతేష్ స్వామి, మాణిక్యరాజు, కోసిగయ్య, మంగమ్మ, హాజీ ఉస్మాన్, వగ్రాని వెంకటేశ్వర్లు, సోఫి రజాక్, బుల్లి నరసింహులు పాల్గొన్నారు.

కోదండ రాముడికి పట్టువస్త్రాల సమర్పణ



వేదపండితుడికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న జయమనోజ్‌రెడ్డి దంపతులు



పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న వేద పండితుడు

ఆదోని అర్బన్ :మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో శ్రీ జానకీ సమేత కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన శ్రీ రామనవమి సందర్భంగా నిర్వహించే కల్యాణ వేడుకకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి దంపతులు ఆదివారం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి పట్టువస్త్రాలు, పలు ఆభరణాలను తీసుకెళ్లి వేదపండితుడు దత్తాత్రేయశర్మ, శ్రీరామనవమి బ్రహ్మోత్సవ కమిటీ నిర్వాహకుడు రామాంజనేయులకు అందజేశారు. అనంతరం వారు ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా వెళ్లి, అక్కడి నుంచి వాహనంలో తీసుకెళ్లి పెద్ద తుంబళం గ్రామంలో ఊరేగించారు. అక్కడి నుంచి ఆలయానికి చేర్చారు.

28న సంగాలలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని సంగాల గ్రామంలో ఈ నెల 28న అంతర్ రాష్ట్ర హోమ్ టీమ్స్ బాలుర కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 63001 93498, 98492 44695, 63021 91524 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

28న పట్టుబడిన వాహనాల వేలం

ఆదోని రూరల్ : ఈనెల 28వ తేదీన స్థానిక పశువుల ఆసుత్రి ఆవరణలో సెబ్ అధికారులు సీజ్ చేసిన వాహనాలకు వేలం నిర్వహిస్తామని ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఒక ట్రాక్టర్, తొమ్మిది కార్లు, నాలుగు ఆటోలు, 31 మోటార్ సైకిళ్ల వేలం వేస్తామని, ఆసక్తి గల వారు 28వ తేదీన ఉదయం రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

భక్తి మార్గంలో నడవాలి

హొళగుంద: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని, అప్పుడే వారికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభు లింగ శివాచార్య స్వామి అన్నారు. ఆదివారం ఎల్లార్తి గ్రామంలో శివశరణి మహాసాధ్వీ హేమరెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశ్వారాధ్యశాస్త్రీ అనే పండితులు భక్తులకు పురాణాన్ని చదివి వినిపించారు. అంతకు ముందు వీరశైవ లింగాయత్‌లు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ముత్తైదువులకు సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అజాత శంభులింగ శివాచార్య, ఇతర మహాస్వాములు భక్తులకు ధర్మ సందేశాన్ని ఇచ్చారు. దాన ధర్మాలు చేయడం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



ఎల్లార్తిలో పురాణ కార్యక్రమంలో స్వామిని సత్కరిస్తున్న మహిళలు

ప్రత్యేక పూజలు

దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పూజారులు మూల విరాట్‌కు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన నిర్వహించారు.

రాహుల్‌కు మద్దతుగా దీక్ష

ఆదోని రూరల్ : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీకి మద్దతుగా పార్టీ స్థానిక నాయకులు సంకల్ప సత్యాగ్రహ దీక్షను ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయ నీలకంఠప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అప్రజాస్వామ్య పాలన సాగిస్తోందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీపై హడావుడిగా అనర్హత వేటు కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. అదానీ, మోదీ బంధాలపైన సాగుతున్న చర్చను దారి మళ్లించాలనే ఈ దుర్ఘటనకు పాల్పడ్డారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీప్‌దోక, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతిరావు, పట్టణ కార్యదర్శి సాయినాథ్, ఐఎన్‌టీయూసీ ఇర్ఫాన్, పట్టణ సహాయ కార్యదర్శి నిసార్‌అహ్మద్, కోశాధికారి మాణిక్యరాజు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన రథంలో ఉంచి మేళతాలాలతో రథాన్నిలాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఎద్దులదొడ్డిలో వీరభద్రస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వీధి కుక్కల పట్టివేత ప్రారంభం

ఆదోని టౌన్ : పట్టణంలో వీధి కుక్కల పట్టివేత ప్రక్రియ పునః ప్రారంభమైంది. ఆదివారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏజెన్సీ నిర్వాహకులు కుక్కలను పట్టి బోనులో బంధించారు. 7, 41వ వార్డుల పరిధిలోని హనుమాన్ నగర్, బుద్దేకల్, పెద్ద కమేళా, నిజాముద్దీన్ కాలనీ, ఖాజీపుర తదితర కాలనీల్లో వీధి కుక్కలను పట్టారు. దాదాపు వంద కుక్కలను పట్టుకున్నారు. అయితే కుక్కల సంతతి నిరోధక ఆపరేషన్ కోసం ముగ్గురు పశువైద్య డాక్టర్‌ల బృందాన్ని సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. రోజుకు 40 కుక్కలకు సంతాన నిరోధక ఆపరేషన్ చేస్తారని చెప్పారు. పట్టణంలో 42 వార్డుల పరిధిలో 4 వేల వరకు కుక్కలు ఉన్నాయి. అందులో గతంలో 1500 కుక్కలకు కు.ని. ఆపరేషన్‌లు చేశారు. మిగిలిన 2,500 కుక్కలకు ఆపరేషన్‌ల ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. ఆపరేషన్ల అనంతరం రేబీస్ వ్యాక్సిన్‌ను వేసి వీధుల్లో వదులుతామని అధికారులు పేర్కొన్నారు.



బోనులో బంధించిన కుక్కలు



వీధి కుక్కను పట్టుకుని ఆపరేషన్ కోసం తీసుకెళ్తున్న దృశ్యం

ఘనంగా బీరలింగేశ్వర స్వామి దేవర



స్వామి వారి పల్లకీని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కోసిగి: మండలంలోని కోసిగి, నేలకోసిగి గ్రామాల్లో కొలువుదీరిన కురువల ఆరాధ్య దైవం శ్రీ బీరలింగేశ్వర స్వామి వారి పెద్ద దేవర ఉత్సవాలు 12 ఏళ్ల తర్వాత ఆదివారం వైభవంగా నిర్వహించారు.వేకువ జామున నుంచి కోసిగిలో పూజారి మల్లయ్య స్వామి, నేలకోసిగి గ్రామాల్లో ఆలయ అర్చకులు పూజారి పెద్ద అయ్యళ్లప్ప, పూజారి సోమప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ, మహామంగళ హారతులు తదితర విశేష పూజలు జరిపించారు. కోసిగిలో మండల కేంద్రంతో పాటు కుప్పగల్, కుంబళనూరు, గట్టుబిచ్చాలి, ఉప్పలం, పోతునాలు, మల్కలదిన్నె, మనకుర్తి, కౌతాళం గ్రామాల నుంచి 9 పల్లకీలు తీసుకొచ్చి స్వామి వారికి చెంతకు చేర్చి పూజలు చేపట్టారు. అలాగే నేలకోసిగిలో గ్రామంతో పాటు కమలర్తి, హాల్వి నుంచి రెండు, బాపురం గ్రామాల నుంచి 5 పల్లకీల్లో స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. స్వామి వారి దర్శనార్థం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వై. సీతారామిరెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, హైదరబాద్ ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మల్లయ్య స్వామి వారికి ఆలయ మార్యాదలతో సన్మానించారు. అనంతరం కోసిగి ఆలయ అభివృద్ధికి వై. సీతారామిరెడ్డి రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, కురువ మల్లయ్య, మంగమ్మ, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురాము, విలేజ్ అండ్ ఖాదీ ఇండస్ట్రీ చైర్మెన్ భాగమ్మ, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ ఎల్లప్ప పాల్గొన్నారు.



స్వామి వారి సన్నిధిలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్